క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు


ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యాగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పెద్దమ్మ తల్లీ దీవించు అంటూ అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండి వంటలు మొక్కుగా చెల్లించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

మెడికల్ కార్మికులకు గుర్తింపు కార్డుల పంపిణీ


గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఏపీ మెడికల్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులకు ఆదివారం గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. పట్టణంలో జరిగిన ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూదోట ప్రకాశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేసే మెడికల్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్ల సమస్యలను పాలకులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, సుశీలమ్మ, నాయకురాలు రాణి స్వరూపా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు ఎస్‌ఐగా సత్యనారాయణ



దొర్నిపాడు: ఎట్టకేలకు దొర్నిపాడు మండలానికి నూతన ఎస్‌ఐని ఉన్నతాధికారులు నియమించారు దొర్నిపాడు స్టేషన్‌కు ఎస్‌ఐ కావాలి అనే శీర్షికతో ఆదివారం సాక్షి ప్రచురించిన కథనానికి వారు స్పందించి నంద్యాల మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణను నియమించారు. ఈయన గతంలో ఆళ్లగడ్డ టౌన్, ఉయ్యాలవాడ మండలాల్లో పనిచేసిన అనుభవం కూడా ఉంది. నూతన ఎస్‌ఐ సోమవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

నేడు మండల మీట్

దొర్నిపాడు: మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సావిత్రి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గోపవరం అమర్‌నాథరెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరగుతుందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు మండల మీట్ మంచి వేదికని, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


బండలాగుతున్న ఎద్దులు

బండి ఆత్మకూరు: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని లింగాపురం గ్రామంలో ఆదివారం ఆరు పళ్ల ఎద్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. మొత్తం ఆరు జతల ఎద్దులు పాల్గొన్నాయి. నాగర్ కర్నూలు జిల్లా రాయవరం గ్రామానికి చెందిన ఎం. అక్షరారెడ్డి ఎద్దులు విజేతగా నిలిచి రూ.30 వేల నగదు బహుమతి దక్కించుకున్నాయి. నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి నారాయణరెడ్డికి చెందిన ఎద్దులు ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 20 వేలు, కలసపాడుకు చెందిన బేతి వెంకటరెడ్డి ఎద్దులు తృతీయ స్థానంలో నిలిచి రూ. 15 వేలు, నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన సుబ్రమణ్యం ఎద్దులు నాలుగో స్థానంలో నిలిచి రూ. 10 వేలు, చాబోలు గ్రామానికి చెందిన లింగన్న ఎద్దులు ఐదో స్థానంలో నిలిచి రూ. 5 వేలు నగదు గెలుపొందాయి.

అలరించిన భక్తిగీతాలాపన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళా వేదికపై బాపట్లకు చెందిన చంద్రమౌళీశ్వర భజన సమాజం వారిచే నిర్వహించిన భజన భక్తులను అలరించింది. ఈ కార్యక్రమంలో మహాగణపతిం, శివశివ శంకరా, శంభో హర హర మహాదేవ, లింగాష్టకం, శ్రీశైలవాస, పార్వతీనాథుడా, శ్రీగిరి మల్లయ్య, పాతాళగంగమ్మ, కైలాసవాసుని, కైలాసగిరివాసా మొదలైన పలు భక్తిగీతాలను, భజనకీర్తనలను అంజమ్మ, వరలక్ష్మి, రత్నమ్మ, సుబ్బారావు, మాధవి, సుధారాణి, అంజతి, వెంకట్రావు, రాజేశ్వరి తదితరులు ఆలపించారు.


నంద్యాల కురువ పేటలో భక్తులకు అన్న వితరణ దృశ్యం


భావసార్ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో పానకం,వడపప్పు పంపిణీ


దొర్నిపాడు మండలం క్రిష్టిపాడులో సీతారాముల కల్యాణోత్సవం


ప్రత్యేక అలంకరణలో బైటిపేట కోదండ రామస్వామి

అంతా రామమయం

- అంబరాన్నంటిన శ్రీరామ నవమి వేడుకలు
- ఊరూరా కనుల పండువగా సీతారాముల కల్యాణం
- తిలకించేందుకు తరలివచ్చిన భక్తజనం


నంద్యాలలోని వైఎస్ నగర్‌లో కల్యాణానికి ముందు రాములోరిని పల్లకీలో తెస్తున్న దృశ్యం


వేడుకను తిలకిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): శ్రీరామ నవమి వేడుకలు అంబరాన్నంటాయి. రామ నామం జపంతో ఆలయాలు మార్మోగాయి. నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో పల్లె, పట్నం అన్న తేడా లేకుండా శ్రీరామ, ఆంజనేయ స్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకలను భక్తులు కనులారా తిలకించి పరవశించారు. ప్రవచనకారులు, వక్తలు, పండితులు శ్రీరాముని జీవిత చరిత్రను వివరించారు. ధర్మ పరిరక్షణకు శ్రీ మహా విష్ణువు ధరించిన అవతారాలన్నింటిలోనూ సంపూర్ణమైనవి రామావతారం, కృష్ణావతారాలే అన్నారు. మానవాళిని సత్యవాక్య పాలకులుగా తీర్చిదిద్ది సన్మార్గంలో నడిపించేందుకు శ్రీరాముడు మానవుడిలా జన్మించారన్నారు. అతి సామాన్యుల నుంచి అసామాన్యుల వరకు అందరికీ అరాధ్య దైవమైన రామచంద్ర మూర్తి సకల గుణాభిరాముడు అన్నారు. శ్రీరాముని జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు.

➤నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితులు పవన్‌శర్మ, ఆధ్వర్యంలో సీతమ్మ వారికి వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేసి సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహించి సీతాలక్ష్మణ సమేత హనుమంత వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

➤పట్టణంలోని దేవనగర్ శ్రీపంచముఖి కాశీ విశ్వేశ్వర శివాలయంలో అర్చకులు శ్రీవాత్సవ ఆధ్వర్యంలో,నందమూరినగర్‌లోని కోదండ రామాలయంలో రామాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో, కల్పనా సెంటర్‌లోని రామాలయంలో మాజీ కౌన్సిలర్ కత్తిశంకర్ ఆధ్వర్యంలో, ఉప్పరిపేటలో శ్రీరామభక్త భజన బృందం ఆధ్వర్యంలో, కోటావీధిలోని శ్రీసీతారామలింగేశ్వరస్వామి భవానీ సహిత దేవస్థానంలో నిర్వాహకులు కొత్త కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ వేడుకలు జరిగాయి.

➤బైటిపేట రామాజంనేయస్వామి దేవస్థానం కోదండ రామాలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకుని భక్తులకు పానకం, వడపప్పు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓ వేణునాథరెడ్డి, అంజి, తిమ్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

➤ఎన్‌జీవో కాలనీలోని సాయికరుణాలయం, సంగపేట కోదండ రామాలయం, ఎస్‌బీఐ కాలనీ రామాలయం, బాలాజీ కాంప్లెక్స్‌లోని బాలాజీ కల్యాణ మండపం, టెక్కె అభయాంజనేయస్వామి దేవాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

➤నంద్యాల(న్యూటౌన్): శ్రీరామ నవమిని పురస్కరించుకుని శ్రీగురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ పెద్ది షేక్షావలిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో కొలువైన శ్రీసుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు.

➤గోస్పాడు మండలంలోని నెహ్రూనగర్, పార్వతీపురం, జిల్లెల్ల, యాళ్లూరు, తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాల వద్ద భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పండుగ ప్రాముఖ్యతను చాటేలా పానకం, వడపప్పు అందజేశారు.

➤దొర్నిపాడు: శ్రీరామ నవమిని పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. దొర్నిపాడు, అమ్మిరెడ్డినగరం, రామచంద్రాపురం, క్రిష్టిపాడు, గుండుపాపల, చాకరాజువేముల తదితర గ్రామాల్లో ఆలయాలు భక్తులతో పోటెత్తాయి.

➤ఉయ్యాలవాడ : మండల కేంద్రమైన ఉయ్యాలవాడతో పాటు సర్వాయిపల్లె, హరివరం గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఉయ్యాలవాడలో స్వామి వారి కల్యాణానికి కంకణ ధారణ, పట్టువస్త్రాలు, పూజా సామగ్రిని గ్రామానికి చెందిన బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సునీత దంపతులు అందజేశారు. ఈ వేడుకలను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

➤**వెండి కిరీటం బహూకరణ**

ఉయ్యాలవాడ : ఆర్.జంబులదిన్నె గ్రామంలోని సీతారామ చంద్రమూర్తి ఆలయంలో వెలసిన సీతమ్మకు అజ్ఞాత భక్తుడు వెండి కిరీటం అందజేసినట్లు అర్చకులు లక్ష్మణస్వామి తెలిపారు. అలాగే గ్రామానికి చెందిన చిట్టెపు సంజీవరెడ్డి, రవిణి దంపతులు రూ.12 వేలు విలువ చేసే బంగారు పుస్తెలు(తాళిబొట్లు), ఇత్తడి గంట, ఏకహార్తి ఇచ్చారన్నారు.

రుద్రవరం: మండలంలో సీతారాముల కల్యాణం కనుల పండువగా సాగింది. రుద్రవరం బెస్త కాలనీ రామాలయంలో వేడుకలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

చాగలమర్రి: మండలంలోని సీతారామలక్ష్మణుల ఆలయాల్లో ఆదివారం శ్రీరామనవమి పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నిర్వాహకులు, ఆలయ కమిటీలు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అహోబిలంలో వైభవంగా..

ఆళ్లగడ్డ: అహోబిల క్షేత్ర పరిధిలో నెలవైన నవ నారసింహ క్షేత్రాలు భక్త జనసంద్రంగా మారాయి. శ్రీరామ నవమిని పురస్కరించుకుని భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి భక్తి పారవశ్యంతో గోవిందా నామస్మరణ చేశారు. దిగువ అహోబిలంలో ఏర్పాటు చేసిన యాగశాలలో ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను ప్రత్యేక పల్లకీలో కొలువుంచి అహోబిలం మఠంలో వెలసిన సీతారామ సన్నిధికి తోడ్కొని వచ్చారు. సీతారామచంద్రుడు, లక్ష్మణ స్వాములకు, శ్రీదేవి, భూదేవి, సమేత ప్రహ్లాదవరద స్వాములకు అభిషేకం, అర్చన, తిరుమంజనం నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను నూతన పట్టుపీతాంబరాలతో అలంకరణచేసి భక్తులకు దర్శణ భాగ్యం కల్పించారు.


దిగువ అహోబిలం ఆలయ ఆవరణలో కొలువైన మూలమూర్తులు సీతారామచంద్రులు, లక్ష్మణ స్వాములు


చాగలమర్రిలోని పట్టాభిరామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


ఉయ్యాలవాడలో సీతారాముల కల్యాణానికి హాజరైన భక్తులు


ఆర్.జంబులదిన్నెలో అర్చకులు లక్ష్మణస్వామికి వెండికిరీటం అందజేస్తున్న భక్తులు


రుద్రవరం బెస్త కాలనీలో సీతారాముల కల్యాణోత్సవ క్రతువు

మునిసిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి


మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఆప్కాస్ కింద పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, మహమ్మద్‌గౌస్ మాట్లాడుతూ పట్టణంలో 260 మంది కార్మికులు ఆప్కాస్‌లో పని చేస్తున్నారన్నారు. సర్కారు ఆప్కాస్‌ను రద్దు చేస్తే వేతన బాధ్యతలు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించరాదన్నారు. విధులు నిర్వహిస్తూ చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. అలాగే పదవీ విరమణ వయస్సును 62కు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు రామాంజనేయులు, ఉపాధ్యక్షులు బాలదుర్గా, యూనియన్ నాయకులు సతీష్, చిన్నస్వామి, శ్రీనివాసులు, శివరాంశంకర్, గోపాల్, జమాలయ్య, ప్రసాద్, వెంకటేష్, శంకర్, శివరాం, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీరంగనాథుడికి పట్టువస్త్రాల సమర్పణ

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథ స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, రజినీబాయి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాల మొదటిరోజున ప్రభుత్వం తరఫున స్వామి,అమ్మవార్లకు 18ఏళ్ల నుంచి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా తహసీల్దారు దంపతులు అధికార లాంఛనాలతో పట్టువస్త్రాలు తేగా వారికి దేవాలయ ఈఓ సాయికుమార్, చైర్మన్ నారాయణరెడ్డి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పట్టువస్త్రాలను అర్చకులు స్వామివారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక, కొత్తపల్లి తహసీల్దార్ ఉమారాణి, సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

లొద్దిపల్లెలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ నెల 18న ఈస్టర్ పండుగను పురస్కరించుకొని స్థానిక ఏబీఎం చర్చి సంఘస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను ఎస్‌ఐ సునీల్ కుమార్ ప్రారంభించారు. పోటీలకు మొత్తం 40 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన జట్లకు తొలి రెండు స్థానాలకు గాను రూ.30 వేలు, రూ.20 వేల చొప్పున నగదు బహుమతులను అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా భావించాలన్నారు. కార్యక్రమంలో సంఘస్తులు పాల్గొన్నారు.

పంట పొలం కాదు..గుర్రపుడెక్క


ఇక్కడ చిత్రంలో పచ్చగా కనిపిస్తున్నది పంట పొలం కాదు..క్రిష్టిపాడు గ్రామంలోని కుందూనదిలో పేరుకుపోయిన గుర్రపుడెక్క. ఇటీవల భారీ వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి గుర్రపు డెక్క భారీగా కొట్టుక వచ్చింది. స్థానికంగా ఉన్న నది వంతెనకు అడ్డుపడింది. దీంతో నదిలో నీటి ప్రవాహం వేగంగా జరగకపోగా సాగునీటి పంపింగ్ సమయంలో మోటార్ పైపులకు అడ్డు పడుతుంది. అధికారులు స్పందించి ఈ గుర్రపు డెక్కను తొలగించాలని రైతులు కోరుతున్నారు. –దొర్నిపాడు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

10న కవి సమ్మేళనం

నంద్యాల(వ్యవసాయం): ముస్లిం రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 10న కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఎండీ రఫీ, నాయకులు అబ్దుల్‌సమ్మద్ తెలిపారు. పట్టణంలోని నడిగడ్డ రాయల్ స్కూల్‌లో జరిగే ఈ సమ్మేళనానికి ఉర్దూ, తెలుగు కవులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారు ఈనెల 8వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు సెల్: 9949731408ను సంప్రదించాలని కోరారు.

కేజీబీవీల్లో సీట్లు పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో సీట్లు పెంచాలని బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీట్లు కేటాయించాలన్నారు. పేద, మధ్యతరగతికి చెందిన ప్రజలు ఆర్థిక స్థోమత లేక ప్రైవేటు పాఠశాలల్లో చదువుకోలేకపోతున్నారన్నారు. వేల సంఖ్యలో విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటే కొందరికే సీట్లు వస్తున్నాయన్నారు. మిగతా వారు బయట చదువుకోలేక చదువు మానేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థినికి సీటు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడులో ఆదివారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల అధ్యక్షుడు అంకన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి పీఎం నరేంద్రమోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్, విశ్వకర్మయోజన, ఉపాధిహామీ, ఉచిత బియ్యం, ఉచిత జల్‌జీవన్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు వేమయ్య, ఓలసుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోస్పాడు: మండలంలోని యాళ్లూరులో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆ పార్టీ నాయకులు మండల అధ్యక్షుడు మధు గోపాల్, బెక్కెం నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఆదివారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించినట్లు తెలిపారు.

అత్యాధునిక పద్ధతుల్లో గుండె ఆపరేషన్లు


డాక్టర్ పీఎస్ఎన్ లక్ష్మణస్వామిని సన్మానిస్తున్న హార్ట్ ఫౌండేషన్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): సాంకేతిక పరిజ్ఞానం కారణంగా ఆధునిక పద్ధతుల్లో గుండె ఆపరేషన్లు అందుబాటులోకి వచ్చినట్లు కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ పీఎస్ఎన్ లక్ష్మణస్వామి చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో గుండె జబ్బులున్న వారికి ఆపరేషన్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణస్వామి మాట్లాడుతూ.. బైపాస్, వాల్వ్ రీప్లేస్‌మెంట్, కోత తక్కువగా ఉండే మినిమల్ ఆపరేషన్ల గురించి వివరించారు. ఆపరేషన్ ఎవరికి అవసరం, ఎందుకు అవసరం, ఆపరేషన్ తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో గుండెజబ్బులతో బాధపడే వారి సంఖ్య మరింత పెరిగిందన్నారు. జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వంశపారంపర్యం, వ్యాయామం లేకపోవడం, ఊబకాయం దీనికి కారణాలని, ఇటీవల వచ్చిన కోవిడ్–19 వల్ల కూడా రక్తనాళాల్లో బ్లాక్‌లు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ గుండెజబ్బుల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. 40 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ తరచూ వైద్యపరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆహారంలో పోషకాలు చేర్చుకోవాలని, తీపి పదార్థాలు, కొవ్వు పదార్థాలు, జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్ తగ్గించాలని, ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు డాక్టర్ భవానీప్రసాద్, రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్‌బాషా, సభ్యులు నాగేశ్వరబాబు, లక్ష్మన్న, వాసుదేవమూర్తి ఆయన్ను ఘనంగా సన్మానించారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో క్యాన్సర్ నివారణ

జూపాడుబంగ్లా: హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో పదిరకాల క్యాన్సర్‌ను నివారించవచ్చునని బచ్చు జానకీరాం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ రవీంద్రబాబు తెలిపారు. ప్రపంచ ఆరోగ్యదినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్యాన్సర్ వ్యాధి వ్యాప్తి–టీకాతో నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామస్తుల విన్నపం మేరకు పాఠశాల విద్యార్థుల కోసం రూ.10లక్షలతో భోజనశాలతో పాటు హెచ్‌పీవీ టీకాను 180 మంది చిన్నారులకు ఉచితంగా వేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే జయసూర్య, గౌరువెంకటరెడ్డి, మాండ్రశివానందరెడ్డి, సర్పంచ్ అంజనమ్మ, వెంకటేశ్వర్లు యాదవ్ పాల్గొన్నారు. కాగా వారికి స్వాగతం పలకడం కోసం విద్యార్థినులను దాదాపు 2గంటల పాటు ఎండలో నిలబెట్టడం విమర్శలకు దారితీసింది.

రావి, వేప చెట్ల ట్రాన్స్‌ప్లాంటేషన్


రవాణాకు సిద్ధంగా ఉన్న చెట్టు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరం క్రిష్ణానగర్‌లో దాదాపు ఐదు దశాబ్దాల చెట్లను మరోచోట అభివృద్ధి చేసేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. క్రిష్ణానగర్‌లో బిల్డరొకరు ఒక పాతబడిన ఇంటిని తొలగించి కొత్త భవనం నిర్మించ తలపెట్టారు. ఈ ఇంటి ప్రాంగణంలో ఒక రావి చెట్టు, వేప చెట్టు ఉన్నాయి. భవనం కట్టాలంటే ఈ చెట్లను పూర్తిగా తొలగించాల్సి ఉంది. పచ్చని చెట్లను అలా తొలగించడం ఇష్టం లేక మరో చోట ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని తలపెట్టారు. ఈ.తాండ్రపాడుకు చెందిన రమేష్‌గుప్తా తన పొలంలో ఉన్న గుడి, గోశాల దగ్గర ఈ చెట్ల ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ముందుకు వచ్చారు. దీంతో కొద్ది రోజుల క్రితమే ఈ చెట్ల కొమ్మలు తొలగించారు. విశ్రాంత డీఎఫ్‌వో జయచంద్రారెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమణారెడ్డి, కర్నూలు నగర పర్యావరణ సంరక్షణ విభాగ్ అధ్యక్షుడు తోట హరికృష్ణలు బిల్డరు సహకారంతో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు శ్రీకారం చుట్టారు. రెండు చెట్లను ఆరేడు అడుగుల లోతులో ఉన్న వేర్ల వరకు క్రేన్ ద్వారా తవ్వారు. వీటిని ఈ.తాండ్రపాడుకు తరలించి రమేష్ గుప్తా పొలంలో ఏడు అడుగుల లోతులో నాటి సారవంతమైన మట్టి, నీళ్లు, వివిధ రకాల పోషకాలతో చెట్లనునాటుతారు. ఎండాకాలమైనందున రోజూ నీళ్లు పెడుతూ ఉంటే కొద్ది రోజుల్లో చిగుళ్లు వస్తాయని విశ్రాంత డీఎఫ్‌వో తెలిపారు. ఇవి పూర్వపు చెట్ల మాదిరిగా పెరుగుతాయని తెలిపారు. చెట్లను పూర్తిగా నరికి వేయకుండా మరో చోట నాటేందుకు ప్రయత్నిస్తే పర్యావరణానికి ధోకా ఉండదని తెలిపారు. ఇది తక్కువ ఖర్చుతో సాధ్యమవుతుందని పేర్కొన్నారు.